క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌లు


పత్తికొండ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ తహసీల్దార్‌గా ఎంఎం రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న రమేష్ బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ వెంకటలక్ష్మి కర్నూలుకు అర్బన్‌కు బదిలీపై వెళ్లారు.


తహసీల్దార్ లోకేశ్వరరావు

దేవనకొండ: నూతన తహసీల్దార్‌గా లోకేశ్వర రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రెవెన్యూ పరమైన సమస్యలున్న వారు నేరుగా తనదృష్టికి తీసుకురావాలని, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈయన చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

స్వచ్ఛభారత్ షెడ్లు ప్రారంభం


షెడ్లను ప్రారంభిస్తున్న సుహాసిని

మద్దికెర : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో చెత్త సంపద కేంద్రాలను (స్వచ్ఛభారత్ షెడ్లు) ఎంపీడీఓ స్వర్ణలత, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ బండారు సుహాసిని సోమవారం ప్రారంభించారు. కంపోస్టు షెడ్లలో తడి, పొడి చెత్త, ప్లాస్టిక్, గాజు వంటి వాటిని వేరి చేసి సేంద్రియ ఎరువుగా మార్చే పనులు చేస్తారన్నారు. వాటి ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని చెప్పారు. పంచాయతీ సభ్యులు లక్ష్మీనారాయణ, బాలచంద్ర పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి


శిక్షణ ఇస్తున్న డీఆర్‌సీ ఏఓ నాగసరోజ

మద్దికెర : పంటలు సాగు చేయడంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ నాగసరోజ అన్నారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ ఆధునిక పద్ధతులపై జిల్లా వనరుల కేంద్రం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కంది పంటలో యాజమాన్య పద్ధతులు పాటించి సంరక్షించుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారులు సూచించిన క్రిమిసంహారక మందులు సకాలంలో పిచికారీ చేసి తెగుళ్లు నివారించుకోవాలన్నారు. ఏఓ రవి, ఏఈఓ భోజరాజు, వీఏఏలు జాకీర్, రాణి పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


ఉప్పర లక్ష్మన్న (ఫైల్)

ఆస్పరి: మండలంలోని వెంగళాయిదొడ్డి బస్టాప్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన ఉప్పర లక్ష్మన్న (24) మృతి చెందిన విషయం తమకు ఆలస్యంగా తెలిసిందని ఆస్పరి సీఐ మస్తాన్‌వలి సోమవారం తెలిపారు. వివరాలు..ముత్తుకూరు గ్రామానికి చెందిన ఉప్పర లక్ష్మన్న వెంగళాయిదొడ్డి గ్రామంలో వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజుల నుంచి కైరుప్పలలో జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని శనివారం రాత్రి కై రుప్పల నుంచి వెంగళాయిదొడ్డికి బైక్‌పై బయలుదేరాడు. వెంగళాయిదొడ్డి బస్టాప్ దగ్గర అదుపు తప్పి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సీఐ వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పౌష్టికాహార పంపిణీలో ఆయాల పాత్ర కీలకం


ఆయాకు బహుమతి అందజేస్తున్న అధికారులు

వెల్దుర్తి: అంగన్‌వాడీల ద్వారా బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం వండి, అందించడంలో ఆయాల పాత్ర కీలకమని ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యాక్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలఅంగన్‌వాడీ హెల్పర్లతో సమావేశం నిర్వహించారు. రుచిగా, పుష్టికరంగా వండటంలో మెలకువలపై అవగాహన కల్పించారు. దాదాపు వంద రకాల ఆహార పదార్థాలు వండిన ఆయాలను అభినందించి 14 మందికి బహుమతులందించి సత్కరించారు. వెల్దుర్తి సూపర్‌వైజర్ సరస్వతి, సుజాత పాల్గొన్నారు.

ఫోన్ కొట్టు.. పరిష్కారం పట్టు

- టోల్ ఫ్రీ నంబర్లకు ఉచితంగా ఫోన్ చేసే వసతి
- సమస్యలపై అధికారులకు సమాచారం చేరవేసే అవకాశం



తుగ్గలి : ఆపద, అవినీతి నిర్మూలన.. సమస్య ఏదైనా ఒక్కఫోన్ కాల్‌తో సాయం పొందవచ్చు. ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు, తోటివారికి సాయం చేయడానికి సెల్‌ఫోన్‌లో బ్యాలెన్స్ ఉండాల్సి అవసరం లేదు. అత్యవసర సమయాల్లో వివిధ శాఖల సేవలను పొందడానికి 24 గంటల పాటు పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లపై కథనం..

'100' పోలీస్ సాయం కోసం..

సమాజంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా స్పందించేది పోలీసులే. ఈ నంబర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రమాదం పొంచి ఉన్నా..అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నా 100 కు ఫోన్‌చేసి సమాచా రం అందించాలి. ప్రమాదం జరిగిన సమయంలో పోలీస్ సాయం కోసం ఈ నంబర్‌ను సంప్రదించాలి.

104..ఆరోగ్య శ్రీ సేవల కోసం..

ఆరోగ్య శ్రీ ద్వారా అందించే చికిత్సలు, ఆస్పత్రుల వివరాలను ఈ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలకు సంబంధించి ఆసుపత్రి యాజమాన్యం నుంచి ఏమైనా సమస్యలు వచ్చినా వారు అందించే సేవల్లో లోపాలున్నా వెంటనే 104కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

1064.. అవినీతి నిర్మూలనకు..

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు అవినీతికి పాల్పడితే వారి భరతం పట్టేందుకు 1064ను సంప్రదించాలి. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు అక్కడకు చేరుకొని అవినీతి అధికారుల ఆగడాలను కట్టడి చేస్తారు.

108.. అత్యవసర వైద్యానికి..

ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగినా..ఎవరైనా అనారోగ్యంతో బాధ పడుతున్నా.. సత్వర వైద్య సేవల కోసం 108కు సమాచారం అందించాలి. ఈ నంబర్‌కు ఫోన్‌చేసిన వెంటనే అంబులెన్స్ వాహనంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక చికిత్స అందిస్తారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను సమీప ఆసుపత్రికి తీసుకెళ్తారు.

101.. అగ్నిమాపక సేవలకు..

అగ్నిప్రమాదాలు చోటుచుకుంటే 101కి ఫోన్ చేసి సమాచారం అందివ్వడం ద్వారా ప్రమాద తీవ్రతను నియంత్రించేందుకు వీలుంటుంది. ఈ నంబర్‌కు సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్పందిస్తారు. వివరాలను నోట్ చేసుకొని తక్షణమే వాహనంతో ఘటనాస్థలికి చేరుకుంటారు. ప్రమాదం ద్వారా నష్టం జరగకుండా నివారణచర్యలు చేపడతారు. బాధితులను సురక్షిత ప్రదేశానికి తరలిస్తారు.

1098.. బాలల నేస్తం..

బాల బాలికల సంరక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ కింద 1098 నంబర్‌ను కేటాయించారు. బాలికల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన కోసం, పిల్లల అపహరణ లేదా ఆపదలో ఉన్నట్లు గుర్తించిన వెంటనే ఈ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. సంబంధిత శాఖ అధికారులు అక్కడికి చేరుకొని పిల్లలను ప్రమాదం నుంచి కాపాడేందుకు కృషి చేస్తారు.

1947.. ఆధార్ కోసం..

ప్రస్తుతం ఆధార్‌కార్డు లేనిదే ఏ పనీ జరగడం లేదు. ఆధార్‌లేని వారు దానిని పొందడానికి, సరైన వివరాలు తెలుసుకోవడానికి ఫోన్ చేయచ్చు.

1950.. ఓటరు గుర్తింపు కార్డు కోసం..

18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ప్రధానం. ఓటరుగా నమోదు తదితర వివరాలు తెలుసుకోవడానికి 1950 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేశారు. కొత్తగా ఓటరు లిస్టులో పేరు ఎలా నమోదు చేసుకోవాలి, జాబితాలో సవరణ, ఓటరు గుర్తింపునకు ఆధార్ అనుసంధానంపై సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

198.. టెలికాం సేవలకు..

బీఎస్ఎన్ఎల్ ఫోన్లకు సంబంధించి లైన్లు, నెట్‌వర్క్ సమస్య ఎదురైనా, ఫోన్ పనిచేయకపోయినా 198కు సమాచారం అందించవచ్చు. శాఖాపరంగా అధికారులు సాయం అందించేందుకు కృషి చేస్తారు.

139..రైల్వే సమాచారం కోసం..

సమీప రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్ల వివరాలు, రాకపోకల సమాచారం తెలుసుకునేందుకు 139కు ఫోన్ చేస్తే వివరాలు లభిస్తాయి. ప్రయాణంలో మరుగుదొడ్ల, నాసిరకం ఆహారం వంటి సమస్యలపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

1912.. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం..

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1912 వినియోగదారులకు అందుబాటులో ఉంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం..కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు, లో ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలను ఉన్నతాధికారులకు చేరవేయొచ్చు.

18002004455.. ఉపాధి హామీ సందేహాల నివృతికి..

జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సకాలంలో పనులు కల్పించక పోయినా..కూలీ డబ్బులు అందకున్నా..వేతనాల్లో తేడా వచ్చినా 18002004455 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

వార్డెన్‌కు సన్మానం

వెల్దుర్తి: స్థానిక బీసీ బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజను సోమవారం స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో శాలువాల, పూలమాలతో సన్మానించారు. హాస్టల్ జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు హరిసింహ నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా ఉత్తమ వసతి గృహ సంక్షేమాధికారిగా శైలజ అవార్డు అందుకోవడంతో పాటు, సేవా సంస్థలు, దాతలను కలుపుకుని హాస్టల్ అభివృద్ధికి, బాలికల సౌకర్యాల మెరుగుకు, గతేడాది పది ఫలితాల్లో హాస్టల్ విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై సన్మానిస్తున్నట్లు తెలిపారు. హిందీ పండిట్, ట్యూటర్ గఫూర్ బాషా, మహానంది, మహేశ్ పాల్గొన్నారు.

బైకులు ఢీ - ముగ్గురికి గాయాలు

హొళగుంద: మార్లమడికి రోడ్డులో సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హొళగుందకు చెందిన ముగ్గురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండల కేంద్రానికి చెందిన కాలేసాబ్, కలందర్ ఒక బైక్ పై మార్లమడికి వైపు వెళ్తుండగా.. అటు వైపు నుంచి హొళగుందకు వస్తున్న హొళగుందకు చెందిన సిద్ధప్ప బైక్ ఒకదానికొకటి ఢీ కొట్టాయి. ముగ్గురు గాయపడగా స్థానికులు వెంటనే హొళగుంద పీహెచ్‌సీకి తరలించారు. కలందర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తరలించారు.

ఆలయ పవిత్రతను దెబ్బతీయకండి

చిప్పగిరి: అనవసరమైన, రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తూ ఆలయ పవిత్రతను దెబ్బతీయడం మంచిది కాదని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. సోమవారం స్థానిక తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ..సూపర్ సిక్స్ హామీల అమలు నుంచి రాష్ట్ర ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుపతి లడ్డూ వ్యవహారం తెరమీదకు తెచ్చారని మండిపడ్డారు. భగవంతుడి ప్రసాదాన్ని కూడా వివాదం చేసి రాజకీయం చేయడం చరిత్రలో ఇదే మొదటి సారన్నారు.టీడీపీ నేతలకు ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం కొత్తేమి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీచ రాజకీయాల కారణంగా ఆలయ పవిత్రత దెబ్బ తినడమే కాక కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ఇప్పటికైనా హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జుటూరు మారయ్య, మాజీ బెల్డోణ సొసైటీ అధ్యక్షుడు దేగులహాలు మల్లికార్జున పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి

పత్తికొండ(తుగ్గలి) : బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, రైతు సంఘం తాలూకా కార్యదర్శి కారన్న డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ రద్దు చేసి, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని ఏఐటీయూసీ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమారం పట్టణంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ..వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలనే ఆలోచనను మానుకోవాలన్నారు.



పత్తికొండలో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన

దేవనకొండ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.నరసారావు అన్నారు. సోమవారం దేశవ్యాప్త కార్మిక సంఘాల పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గత ఐదు సంవత్సరాల్లో వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధుల్లో లక్ష కోట్లు ఖర్చు చేయకుండా ఖజానాకు తిరిగి జమ చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూసుఫ్, కృష్ణ, భాస్కర్, వీరాంజనేయులు, రామంజి, శ్రీనివాసులు, మద్దిలేటి, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎల్లార్తి ఉరుసుకు జోరుగా ఏర్పాట్లు


ఎల్లార్తిలో దర్గా రోడ్డును గ్రావెల్‌తో చదును చేయిస్తున్న దృశ్యం


తాగునీటి కోసం బోరు వేయిస్తున్న దృశ్యం

హొళగుంద: ఈ నెల 29 నెల నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఎల్లార్తి షేక్షావలి, షాషావలి ఉరుసు నిర్వహిస్తున్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా సోమవారం దర్గా రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ట్రాక్టర్లతో గ్రావెల్ తోలించి ప్రొక్లెయిన్‌తో చదును చేయించారు. అలాగే.. వీధి లైట్లు, తాగునీటి వసతి,అవసరమైతే ట్యాంకర్‌తో అందజేసేందుకు ట్యాంకర్ ఏర్పాటు, పారిశుద్ధ్యం లోపించకుండా చెత్త, చెదారం తొలగింపు, భక్తులకు మూడు రోజుల పాటు మెడికల్ క్యాంపుతో పాటు అవసరమైన ఇతర ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దర్గన్న, ఎస్కే గిరి ఉన్నారు.

స్వర్ణాంధ్ర ప్రణాళికను ఇంటింటికీ చేరవేయాలి


మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్షుమ్మ

కృష్ణగిరి: స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ సమాచారం చేరవేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్షుమ్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో స్వర్ణాంధ్ర విజన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ విజన్ అమలులో ప్రజల నుంచి ప్రభుత్వానికి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతున్న మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న సచివాలయ ఉద్యోగులు ఈ విజన్‌పై అభిప్రాయాలు సేకరించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఈఓఆర్డీ మురళీమోహన్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు అబ్దుల్‌వహీద్, హరినాథ్, ఏఓ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి నవీన్, ఏఎస్ఓ జానకీబాయి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి అవమానం

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్‌ను కూటమి నాయకులు అవమానించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ముత్తుకూరు పాత పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్‌తో పాటు బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అయితే అక్కడున్న కుర్చీల్లో కొందరు ఏ అర్హత లేకపోయినా.. కేవలం కూటమి నాయకులు కావడంతో ఆశీనులయ్యారు. కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి వారి వెనుక నిలబడాల్సి వచ్చింది. దీంతో సభ అయ్యేంత వరకు ఆయన నిలబడే ఉన్నారు. సభలో తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపీడీఓ రాణెమ్మ ఉన్నా ఆయనకు గౌరవం లభించలేదు.


ముత్తుకూరు సభలో వెనుక నిల్చున్న పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్ (వృత్తంలో ఉన్న వ్యక్తి)

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఐటీఐ కోర్సు చదివేందుకు నాల్గవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆసక్తిగల అభ్యర్థులు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 27న ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ ధ్రువీకరించుకున్న విద్యార్థులు ఈ నెల 28క కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

సర్వే డీఐవోఎస్‌గా దేవేంద్రయ్య స్వామి

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐవోఎస్)గా జి దేవేంద్రయ్యను నియమిస్తూ సర్వే శాఖ డైరెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవేంద్రయ్య వైఎస్సార్ కడప రెవెన్యూ డివిజనల్ డీఐవోఎస్‌గా పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

మద్దికెర : గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈఓ శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలలోకి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చుట్టూ వాకింగ్ ర్యాంప్ నిర్మించడమే గాకుండా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించే పనులు వేగంగా చేయిస్తున్నామని చెప్పారు. ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, బాలు ఉన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం ఉంటుందని ఏపీఓ హేమసుందర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై 17వ సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపటిందని చెప్పారు. ఈ పనుల్లో ఏవైనా అక్రమాలు జరిగి ఉంటే బహిరంగ ప్రజావేదికలో బయటపడతాయన్నారు. వాటిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.


కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, గోవిందు, వెంకటేష్, మల్లి, గోపాల్, ఉశేని పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొస్తున్న గంగాధర్ అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాల నరసింహులు సోమవారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప తాలూకా కె.బెళగల్ నుంచి బైక్‌పై మద్యం ప్యాకెట్లను తీసుకొస్తుండగా కడ్లమాగి సమీపంలోని ఎస్ఎస్ ట్యాంకు వద్ద అరెస్ట్ చేసి 96 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసి చేసినట్లు వివరించారు.

బీచ్ సెపక్‌తక్రా విజయంలో ఆలూరు వాసి



సెపక్‌తక్రాలో కాంస్య పతకంతో భారత్


కాంస్య పతకంతో ఏపీ సెపక్‌తక్రా వైస్ కెప్టెన్ కురుబ మధు

ఆలూరు: ఆసియా బీచ్ సెపక్ తక్రా క్రీడలను ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు చైనా దేశంలోని కింగ్‌డావోలో నిర్వహించారు. పోటీలకు భారతదేశం నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేశారు. మన రాష్ట్రం తరఫున ఆలూరు గ్రామానికి చెందిన కురుబ మధు భారత్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. కాగా పోటీల్లో మన దేశానికి కాంస్య పతకం లభించింది. మధు మాట్లాడుతూ.. జట్టు విజయంలో తన వంతు బాధ్యత నిర్వర్తించానని చెప్పాడు. తాను ఇంకా మరింత నైపుణ్యాలు, మెలకువలను నేర్చుకోవాల్సి ఉందన్నాడు. దేశానికి పతకం సాధించడంపై మధు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

బస్ షెల్టర్‌నే ఆక్రమించేశారు

ఆలూరు: హొళగుంద మండలం ఇంగదహాళ్ గ్రామంలో ప్రయాణికుల కోసం గతంలో రూ. లక్షతో గ్రామాల్లో బస్ షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాల సంఖ్య పెరగడంతో అందులో ప్రయాణికులు నిరీక్షించే అవసరం తప్పింది. ప్రజల తాకిడి తక్కువగా ఉండటంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బస్ షెల్టర్‌ను ఆక్రమించి బంకు ఏర్పాటు చేసుకున్నాడు. బంకును అడ్డంగా ఏర్పాటు చేయడంతో బస్టాండ్‌లోకి వెళ్లే అవకాశం లేకుండా పోయింది.


ఇంగదహాళ్ గ్రామంలో బస్ షెల్టర్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన బంకు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గోవిందురెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 21న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన పుట్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో డి.నందిని, అండర్-14 విభాగంలో అరుణ్ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ రంగస్వామిని ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ పాండురంగడుతో కలిసి అభినందించారు.

ఆలూరు రూరల్: రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికై నట్లు ప్రభుత్వ బాలుర పాఠశాల-2 ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధనలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 21న కర్నూలులో బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. అండర్-17 విభాగంలో సంతోష్,సాయిరాం, అండర్-14 విభాగంలో చిరంజీవి,తరుణ్ తేజ ఎంపికైనట్లు చెప్పారు. అండర్-17 విభాగం పోటీలు పశ్చిమ గోదావరి జిల్లాలో, అండర్-14 పోటీలు పల్నాడులో త్వరలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పాఠశాల పీడీ కవిరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

పత్తికొండ/తుగ్గలి: రెండు మండలాల్లో మంగళవారం నుంచి «పొలం పిలుస్తోంది» కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు వెంకటరాముడు, పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. తొలి రోజు పత్తికొండ-1, పత్తికొండ-2, తుగ్గలి మండలంలో ముక్కెల్ల, మారెల్ల, రెండో రోజు బుధవారం పత్తికొండ మండలంలో పత్తికొండ-3, పుచ్చకాయలమాడ, తుగ్గలి మండలంలో ఎద్దులదొడ్డి, పెండేకల్లు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలతో రైతులకు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, సేంద్రియ వ్యవసాయం, ప్రభుత్వ సబ్సిడీలు తదితర వాటిపై అవగాహన కల్పించనున్నట్లు ఏవోలు తెలిపారు. కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హాలహర్వి: మండలంలోని విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం, బుధవారం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపడతామన్నారు.

ఆలూరు రూరల్: వ్యవసాయ శాఖ అధ్వర్యంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు సునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని 5 మండలాల్లో ప్రతి మంగళవారం,బుధవారం కార్యక్రమంఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పొలానికి వెళ్లి పంటల సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తారన్నారు.

హొళగుంద: మండల కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ ఆనంద్ లోకదళ్ తెలిపారు.

చిప్పగిరి: మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని ఏఓ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. గుమ్మనూరు గ్రామంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఆలూరు: హొళగుంద నుంచి మార్లమడికి గ్రామం వరకు రూ.5కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ ఈఈ హెచ్‌డి ఈరన్న సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నుంచి శాంపిళ్లను సేకరించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలతో జరుగుతున్న రోడ్డు పనులు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. ఆలూరు పీఐయూ డీఈ భాస్కర్, ఏఈ చంద్రశేఖర్ , కాంట్రాక్టర్ బి.రఘునాథ్‌రెడ్డి ఉన్నారు.


మార్లమడికి బీటీ రోడ్డు శాంపిళ్లను సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు